క్లుప్తంగా

ముగ్గురు అధ్యాపకులకు డాక్టరేట్లు



గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో అధ్యాపకులుగా పని చేస్తూ ఈసీఈ, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పరిశోధనలు చేసిన టి.సుభాషిణి, బి.రోహిత్ జస్వంత్, ఇ.నాగకుమారిలకు నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్లు అందజేసింది. వీరిని మంగళవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్ అభినందించారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి రామకృష్ణ, సలహాదారుడు డాక్టర్ పి.రవీంద్రబాబు, మెంటార్ డాక్టర్ బి.కరుణ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

పోలీసు స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన



మండవల్లి: మండవల్లిలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన పూడిక పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), సీఐ వైవీఎల్ఎల్ నాయుడుతో కలిసి మంగళవారం పరిశీలించారు. పనుల వివరాలను సీఐ నాయుడు, ఎస్సై రామకృష్ణ ఎమ్మెల్యే డీఎన్నార్‌కు వివరించారు. నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, చేబోయిన వీర్రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ యాద్, కొల్లా సాయి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి ఏపీఎంగా రాజశ్రీ



మండవల్లి: మండవల్లి ఏపీఎంగా జి.రాజశ్రీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నిడమర్రు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎడ్వర్డ్ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. మండవల్లి క్లస్టర్ సీసీగా జిలక్ష్మణ స్వామి బాధ్యతలు స్వీకరించినట్టు ఏపీఎం పేర్కొన్నారు. అనంతరం ఎంఎస్ మీటింగ్ నిర్వహించారు. వీఓఏలు సక్రమంగా విధులు నిర్వహించాలని ఏపీఎం రాజశ్రీ కోరారు.

రైల్వే స్థలాల ఆక్రమణల తొలగింపు



మండవల్లి: స్థానిక మూడుతాళ్లపాడు రోడ్డులో రైల్వే ఆక్రమణలను అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్ ఏఎస్ రామాంజనేయులు, ఆర్ఎఫ్ సీఐ ఎస్‌కే దస్తగిరి ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. శాంతి భద్రలకు విఘాతం కలగకుండా ముందు జాగ్రత్త చర్యగా రైల్వే పోలీసులు, స్థానిక పోలీసుల భారీ బందోబస్తు మధ్య రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ఆరు గృహాలను తొలగించారు. నిలువ నీడలేని తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు తోట బాలకృష్ణ, వీరనాల రంగనాయకమ్మ, గుబిలి నాగభూషణం, బేతు విజయ్ కుమార్, ఘంటసాల నాగేశ్వరరావు, తోట నాగభూషణం కోరారు. రైల్వే ఆక్రమణల తొలగింపు

వైభవంగా ద్వాదశ వార్షిక మహోత్సవం

కైకలూరు: అయ్యప్పస్వామి ద్వాదశ వార్షిక మహోత్సవ వేడుక కైకలూరు భవానమ్మ చెరువు సమీపంలోని అయ్యప్ప ఆలయంలో భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. స్వామివారికి గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు గోపీస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి పనుల పరిశీలన

పామర్రు: మండలంలోని కురుమద్దాలి గ్రామంలో పంట బోదె తవ్వకం పనులను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో పొలు రాజు మంగళవారం పరిశీలించారు. పనులను కచ్చితమైన కొలతలతో నాణ్యత ప్రమాణాలకు లోబడి నిర్వహించాలని అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పంట బోదెల పూడిక తీత పనులు జరుగుతున్నాయని అన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 5,420 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి చదువులే లక్ష్యం



ఆటపాక హైస్కూల్లో కిట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: అంతర్జాతీయ స్థాయి చదువులను పేదలకు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు మండలం ఆటపాక, కలిదిండి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాకానుక కిట్లను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మంగళవారం పంపిణీ చేశారు. పలువురు విద్యార్థులు ఇంగ్లిషులో మాట్లాడుతూ స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కుట్టుకూలితో సహా మూడు జతల యూనిఫామ్, బ్యాగు, బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్‌బుక్స్, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టుతో పాటు మిని డిక్షనరీని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో రూ.60,329 కోట్లు విద్యారంగానికి ఖర్చు చేశారని చెప్పారు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం విద్యా కానుక కిట్ కోసం రూ.2,400 ఖర్చు పెడుతోందన్నారు. సీబీఎస్ఈలో సిలబస్‌ను ఇంగ్లిషు మీడియంలో తీసుకురావడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో మన విద్యార్థులు పోటీ పడుతున్నారని తెలిపారు. కలిదిండిలో వైఎస్సార్ సీపీ నాయకులు గుడివాడ ఫణి కుమార్ కుమారుడు మహేష్ విద్యార్థులకు జామెట్రిబాక్సులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, కైకలూరు ఏఎంసీ చైర్మన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీలు మహమ్మద్ జహీర్, కనకదుర్గారాణి, నాగలక్ష్మి, సర్పంచ్‌లు తలారి మణి, మసిముక్కు మారుతీప్రసన్న, కలిదిండి ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి, ఎంఈఓలు డి.రామారావు, నరేష్‌కుమార్, కైకలూరు స్కూల్ విద్యా కమిటీ చైర్‌పర్సన్ వంగలపూడి ఇందిరా బోస్, సయ్యపురాజు గుర్రాజు, హెచ్ఎంలు జగన్, స్వర్ణకుమారి, నాయకులు బావిశెట్టి నాగేశ్వరరావు, అబ్దుల్ హమీద్, నిమ్మల సాయి, నీలపాల వెంకటేశ్వరరావు, ఊర శ్రీధర్, దండే రవిప్రకాష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచి నాంచారయ్య

విద్యాకానుక కిట్ల పంపిణీ

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం కుదరవల్లి ఎంపీయూపీ స్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను మగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వసంతల సత్యవతి, ఎంపీటీసీ గుజ్జుల చైతన్యజ్యోతి ముఖ్య అతిథులుగా విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు వసంతల కృష్ణ, గుజ్జుల లాజరు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్ : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. తొలిరోజైన సోమవారమే అనేక పాఠశాలల్లో జేవీకే అందజేయగా మంగళవారం మరికొన్ని పాఠశాలల్లో అందజేశారు. చినకామనపూడి యూపీస్కూల్లో సర్పంచి చిట్టూరి నాంచారయ్య కానుక అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యలో మరింత రాణించాలని విద్యార్థులకు సూచించారు. పెయ్యేరు శివారు రంగాపురం పాఠశాలలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జాస్తి బాబూరాజేంద్రప్రసాద్ విద్యాకానుక అందజేయగా ఉపాధ్యాయులు జె.భగవద్గీత, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు చేయూత

- 36 మంది విద్యార్థులకు రూ.4.50 లక్షలు
- రాపర్ల గ్రామానికి చెందిన శేషులు ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, కేర్ ట్రస్టు సాయం



విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ కాకర్ల విజయ మాధురి

పామర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు దాతలు సాయం అందించారు. సుమారు 36 మంది విద్యార్థులకు రూ.4.50 లక్షలను ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. రాపర్ల గ్రామానికి చెందిన శేషులు ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, కేర్ ట్రస్టు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పామర్రు హైస్కూలులో బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు, 9వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన మండల పరిధిలోని ఏడు జెడ్పీ హైస్కూళ్లకు చెందిన 36 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు దాతల సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ కాకర్ల విజయ మాధురి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు సాయం చేస్తే వారి భవిష్యత్‌కు మంచి ఆసరా అవుతుందని అన్నారు. తన తండ్రి కాకర్ల అర్జునరావు 70 ఏళ్ల క్రితం ఇదే పాఠశాలలో చదువుకున్నారని, దీనికి గుర్తుగా ఈ పాఠశాలతో పాటు మండలంలోని అన్ని హైస్కూళ్లలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నామని అన్నారు. తనతల్లి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ద్వారా గత మూడేళ్లుగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని తెలిపారు. పదో తరగతిలో పాఠశాలస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.10 వేలు, 9వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మండల పరిధిలోని ఏడు హైస్కూళ్లలో ఇంగ్లిషు, తెలుగు మీడియం విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాలను అందించారు. జమీదగ్గుమిల్లి, కనుమూరు హైస్కూల్‌లలో ఇంగ్లిషు మీడియం లేని కారణంగా మిగిలిన వారికి అందించామని అన్నారు. విద్యార్థులు ఈ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇదే హైస్కూల్‌లో విద్యార్థులు కంప్యూటర్ విద్య అందించాలనే లక్ష్యంతో ట్యాబ్‌ను ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ రాధిక, కోశాధికారి మాధవి, ట్రస్టు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, సభ్యులు కె.బలరామమూర్తి, కె.శివయ్య, పామర్రు హైస్కూల్ హెచ్ఎం బి.సురేష్, ఇతర హైస్కూళ్ల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొడాలి నాని కృషి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి
- టీడీపీ నేతల విమర్శలకు ఖండన



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

గుడివాడ టౌన్: మల్లాయిపాలెం లే అవుట్‌లో 77 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్ల నిర్మాణం పనులు పూర్తిగా కొడాలి నాని కృషితోనే జరిగాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత రెండు రోజులుగా తెలుగుదేశం నాయకులు తాము నిర్మించిన టిడ్కో ఇళ్లను ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి పంచిపెడుతున్నారని విమర్శలు చెయ్యడాన్ని ఆయన ఖండించారు. మొత్తం 8,912 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా ఫేజ్–1 అంటూ కేవలం 3,212 ఇళ్లు నిర్మాణం ప్రారంభించి ఒక్క ఇంటికి కూడా అన్ని హంగులు, మౌలిక వసతులు, కరెంట్ కూడా ఏర్పాటు చెయ్యకుండా గాలికి వదిలేశారన్నారు. తిరిగి వైఎస్ జగన్ మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కొడాలి నాని అన్ని ఇళ్లు నిర్మించి ఒకే రోజు ప్రజలకు ఇవ్వాలనే సంకల్పంతో రూ.800 కోట్లు పైబడి నిధులు తెచ్చారన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు, పోలీస్ స్టేషన్, సబ్ స్టేషన్ తదితర వసతులు కూడా కల్పించారని తెలిపారు. తెలుగుదేశం నాయకులు మేము కట్టామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మరోసారి రుజువు అవుతోందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిన నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ



గుడివాడ టౌన్: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు అవగాహన సదస్సులు దోహదపడతాయని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏఎన్నార్ కళాశాల, కేబీఆర్ ఐటీఐ కళాశాల, కేటీఆర్ మహిళా కళాశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కేటీఆర్, కేబీఆర్ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఏఎన్నార్ కళాశాలలో లైఫ్ స్కిల్ ఫర్ యూత్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ 15వ తేదీ వరకు విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, పీజీ విభాగం హెచ్ఓడీ సి.లక్ష్మీనాద్, కేటీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గాయిత్రి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో మజ్జిగ పంపిణీ



ముదినేపల్లి రూరల్ : మండలంలోని కొత్తపల్లి సెంటర్లోని దాసాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. వాడవల్లికి చెందిన తమ్మన శేషాయి మజ్జిగ పంపిణీకి ఆర్థిక సాయం అందించినట్టు నిర్వాహకులు తెలిపారు.

పాలిసెట్ అభ్యర్థులకు తరగతులు

కైకలూరు (కలిదిండి): పాలిసెట్ అభ్యర్థులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నామని కలిదిండి డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మల్లప్పరాజు మంగళవారం చెప్పారు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని, ఈనెల 24 వరకు రెండు వారాల పాటు ఈ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరాలనే ఆసక్తి గల అభ్యర్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

కేటీఆర్ కళాశాల విద్యార్థులతో డీఎస్పీ శ్రీకాంత్



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడ టౌన్: మాదక ద్రవ్యాలు జీవితాలను సర్వనాశనం చేస్తాయని డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. స్థానిక కేటీఆర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు–నష్టాలు అనే అంశంపై విద్యార్థులకు రెండో రోజు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ పి. జాషువ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాదక ద్రవ్యాలు వినియోగం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు నాశనం చేస్తాయన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీ ఉన్నతిని ఆశించి చదివిస్తారని దానిని విద్యార్థులు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల అమ్మకం, రవాణ వంటి చర్యలు చట్టరీత్యా నేరమని అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, హెరైన్ తదితర మత్తు పదార్థాలు అమ్ముతున్న వారి సమాచారం 14500 లేదా 100 నంబర్ ద్వారా పోలీసులకు తెలియచేసి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ తులసీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ గాయిత్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగలకు మేలు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ



వీరంకిలాకు వద్ద సభలో మాట్లాడుతున్న కృష్ణమాదిగ

పమిడిముక్కల: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ జాతికి మేలు జరుగుతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ అన్నారు. వీరంకిలాకు ఇరిగేషన్ బంగ్లా ఆవరణలో మంగళవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) కృష్ణాజిల్లా సన్నాహక సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 29 సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నామన్నారు. పోరాటంలో ఎన్నో అడ్డంకులు, అవరోధాలు వస్తున్నాయన్నారు. వర్గీకరణ జరగకపోవడం వల్ల మాదిగలు విద్యా, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ సహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత వీరంకిలాకు సెంటర్‌లో డప్పువాయిద్యాలతో, బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మందా వెంకటేశ్వరరావు, కొల్లూరి బసవ, పేటేటి ప్రభాకర్, గంద్రపు రాకేష్‌నాథ్, దొండపాటి దావీదు, వేల్పూరి మధు, కొల్లూరి దినేష్, కాటూరి భాను, కోటా దానియేలు, సుజాత, ఎంఈఎఫ్ నాయకులు బొకినాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి తాతయ్య

పెదపూడి(మొవ్వ): కృష్ణా జిల్లాలో తొలిసారిగా జూలైలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టీ తాతాయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దగాని సంగీతరావు పిలుపు ఇచ్చారు. మొవ్వ మండలం కూచిపూడి–పెదపూడి ప్రధాన కూడలిలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం పామరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మేరుగు విజయకుమార్, సీపీఐ సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, చెరుకు శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను కలిసిన డీఎల్‌పీఓ



ఎమ్మెల్యేకు మొక్కను అందిస్తున్న డీఎల్‌పీఓ

కైకలూరు: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)లను డీఎల్‌పీవో పూర్ణ చంద్రశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పంచాయతీల అభివృద్ధిపై చర్చించారు. ఆయన వెంట కైకలూరు సర్పంచి దానం మేరీ నవరత్న కుమారి, పంచాయతీ కార్యదర్శులు జి.శివన్నారాయణ, రాగాల ఉదయ్ కుమార్, రవికిరణ్ ఉన్నారు.

దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పామర్రు: మహిళల ఆత్మరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దిశ యాప్ సత్ఫలితాలను ఇస్తుందని పామర్రు ఎస్‌ఐ పీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్‌లో పోలీసు సిబ్బందితో కలిసి దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళల సెల్‌ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్లోడ్ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. యువతులు యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందజేయవచ్చన్నారు. ఆటోఎక్కే సమయంలో ఆటో నంబరుని ఈ యాప్‌లో నమోదు చేసి రక్షణ పొంద వచ్చని చెప్పారు. పలువురు విద్యార్థినులకు దిశ యాప్‌ను ఫోన్‌లలో డౌన్లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సత్వర రుణాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అతి తక్కువ వడ్డీ రేట్లతో సత్వర రుణాలను మంజూరు చేస్తామని బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ ఎంఎస్ఎంఈ హెడ్ పి.జయకృష్ణ తెలిపారు. హనుమాన్ జంక్షన్ బ్రాంచ్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఎంఎస్ఎంఈ హెడ్ జయకృష్ణ మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో విజయవాడ జోన్ పరిధిలో రూ.130 కోట్ల పారిశ్రామిక రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. 2023–24 ఏడాదిలో మరింత అధికంగా రూ.165 కోట్ల రుణాల మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎంఎస్ఎంఈల ఏర్పాటును ప్రోత్సహించేందుకు విజయవాడ జోనల్ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశ్రమల స్థాపనకు గరిష్ఠంగా రూ.25 కోట్ల వరకు రుణాలను మంజూరు చేస్తామని జయకృష్ణ తెలిపారు. రూ.2 కోట్ల వరకు ఎలాంటి హామీ లేని ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరు చేస్తున్నామని వివరించారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



పామర్రు లయన్స్ క్లబ్‌కు ఎంపికైన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి

పామర్రు: పామర్రు లయన్స్ క్లబ్ 2023–24 ఏడాదికి నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమం మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా లయన్స్ జిల్లా 216డి జిల్లా క్యాబినెట్ సహాయ కార్యదర్శి లయన్ బైసాని నాగేశ్వరరావు వ్యవహరించారు. ప్రెసిడెంట్‌గా పీఎంఎస్ ప్రసాద్, కార్యదర్శిగా ముగడ మధుసూదనరావు, కోశాధికారిగా నవులూరి వీర వెంకయ్య, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఆర్.భార్గవి, జోగి గంటలయ్య, సహాయ కార్యదర్శిగా బొప్పన స్వర్ణలతలను ఎంపిక చేశారు. డైరెక్టర్లుగా డాక్టర్ బీవీ అప్పారావు, బైసాని నాగేశ్వరరావు, కె.చంద్రశేఖర్, ఎన్.రవిశంకర్‌రెడ్డి, తోట రమేష్, పెరుమాళ్ల రాధాకృష్ణ, లంకపల్లి శ్రీనివాసరావు, పి.సురేష్ చంద్రరెడ్డి, బొగ్గరపు జాలయ్య, బొమ్మారెడ్డి కోటిరెడ్డిలను ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 14వ తేదీ సాయంత్రం 4గంటలకు స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో ప్రమాణ స్వీకరణ చేస్తారు.

భవిత కేంద్రం తనిఖీ



భవిత కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: గూడూరులోని నాన్ భవిత కేంద్రాన్ని ఎంపీపీ సంగా మధుసూదనరావు మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని వసతులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో మాట్లాడిన ఎంపీపీ వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం విజయ్‌కుమార్, ఐఈఆర్పీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: మండలంలోని గంగూరు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. పామర్రు మండలం అడ్డాడ గ్రామానికి చెందిన గురువిందపల్లి వీరమ్మ గుడివాడలో పండ్ల వ్యాపారం చేస్తోంది. మామిడి పండ్లు కొనుగోలు చేయటానికి ఆమె ఆటోలో విజయవాడ బయలుదేరింది. డ్రైవర్ సురేష్ నిర్లక్ష్యంగా ఆటో నడపటంతో గంగూరు గ్రామం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వీరమ్మ, డ్రైవర్ భార్య భార్గవి గాయపడ్డారు. వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

13 ఎకరాల వరిగడ్డివాములు దగ్ధం

చినముత్తేవి(మొవ్వ): మండలంలోని చినముత్తేవిలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 13 ఎకరాల వరిగడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. మొవ్వ ఫైర్ అధికారి కే వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. చినముత్తేవి వాటర్ ట్యాంక్ సమీపంలోని ఓ ప్రదేశంలోని గడ్డివాములకు అజాగ్రత్త పొగ తాగటంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వరిగడ్డివాములు తగలబడ్డాయి. రూ.90 వేల ఆస్తినష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఈ ప్రమాదంలో చినముత్తేవి గ్రామానికి చెందిన రైతులు పోతుల జ్యోతి బసుకు చెందిన 10 ఎకరాల గడ్డివామి, సుంకర పున్నయ్యకు చెందిన మూడు ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతైందని వివరించారు.